# ఉత్తరాదిలో పిఇబిఎస్ ప్లాంట్

## పెన్నార్ గ్రూప్ సన్నాహాలు

హైదరాబాద్ (బిజినెస్‌బ్యూరో) : పెన్నార్ ఇండస్ట్రీస్ గ్రూప్ సంస్థ పెన్నార్ ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పిఇబిఎస్ పెన్నార్) పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్తరాదికి ఉత్పత్తి కార్యకలాపాలను విస్తరించే యోచనలో ఉంది. కంపెనీకి ఉత్తరాది సంస్థల నుంచి ఆర్డర్లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా గుర్‌గావ్, మానెసర్ పారిశ్రామిక ప్రాంతాలకు దగ్గరగా ఉత్పత్తి కేంద్రం ఉండాలన్నది కంపెనీ ఆలోచన. మెదక్ జిల్లా సదాశివపేటలోని ఉత్పత్తి కేంద్రం సామర్థ్యాన్ని సంస్థ ఇప్పటికే 30 వేల టన్నుల నుంచి 60 వేల టన్నులకు పెంచింది. కొత్త బీమ్‌లైన్ ఈ నెల నుంచే ఉత్పత్తి ప్రారంభిస్తుందని కంపెనీ చైర్మన్ నృపేందర్‌రావు తెలిపారు. ప్రస్తుత విస్తరణ తర్వాత కంపెనీ టాప్ ఫోర్ జాబితాలో చేరుతుంది.

ఇన్‌ఫ్రా, వేర్‌హౌజింగ్ విభాగాల్లో ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్టు ఆయన చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం కారణంగా ఉత్తరాది క్లయింట్ల కోసం గుజరాత్ లేదా యుపిలో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉన్నట్టు ఆయన వివరించారు. పూర్తిగా కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలా లేక ప్రస్తుతం ఇదే తరహా వ్యాపారంలో ఉన్న కంపెనీలను కొనుగోలు చేయాలా అన్న విషయం పరిశీలిస్తున్నట్టు ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. ఒకవేళ కంపెనీలను కొనుగోలు చేయాల్సి వస్తే డీల్ సైజు 50 కోట్ల రూపాయల వరకు ఉండే అవకాశం ఉందని ఆయన అన్నారు. సొంతగా ప్లాంట్‌ను ఏర్పాటు చేయాల్సి వస్తే 30 వేల టన్నుల సామర్థ్యానికి కనీసం 30 కోట్ల రూపాయల మేర వ్యయం అవుతుందని ఆయన తెలిపారు. కంపెనీపై రుణభారం పెద్దగా లేని కారణంగా నిధుల సమీకరణ సమస్యే కాబోదని ఆయన చెప్పారు. వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల వల్ల కంపెనీ మార్జిన్లలో గణనీయమైన పెరుగుదల ఉన్నట్టు నృపేందర్‌రావు వివరించారు. ప్రస్తుతం పిఇబిఎస్ పెన్నార్ క్లయింట్ల జాబితాలో అల్ట్రాటెక్, ఎల్అండ్‌టి, హెచ్‌సిసి, డాక్టర్ రెడ్డీస్, పి అండ్ జి వంటి క్లయింట్లు ఉన్నట్టు ఆయన తెలిపారు. అల్ట్రాటెక్ కోసం 99 మీటర్ల వైశాల్యంతో సువిశాలమైన బొగ్గు నిల్వ కేంద్రాన్ని పిఇబిఎస్ నిర్మించినట్టు ఆయన పేర్కొన్నారు. గత ఏడాది 310 కోట్ల రూపాయల విలువైన ఆర్డర్లు రాగా అందులో 150 కోట్ల రూపాయల పనులను పూర్తి చేసినట్టు ఆయన వివరించారు. మాల్దీవ్స్‌లో జిఎంఆర్ పునర్నిర్మిస్తున్న విమానాశ్రయంలో హేంగర్‌కు సంబంధించిన కాంట్రాక్టు తమకు లభించినట్టు ఆయన చెప్పారు.



నృపేందర్‌రావు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1350 కోట్ల రాబడిపై 75 కోట్ల రూపాయల నికరలాభాన్ని కంపెనీ అంచనావేస్తున్నది. ఆటో, ఎలక్ట్రానిక్ వినియోగవస్తువులు, రైల్వేలు, మౌలిక వసతుల రంగానికి అవసరమైన వాల్యూ యాడెడ్ ఉత్పత్తులను సప్లయ్ చేస్తున్న పెన్నార్ భెల్, ఎన్‌టిపిసి వంటి సంస్థల నుంచి కూడా ఆర్డర్లను దక్కించుకునే ప్రయత్నాల్లో ఉంది.

శుక్రవారం బిఎస్ఇలో పెన్నార్ ఇండస్ట్రీస్ షేరు 0.65 రూపాయల నష్టంతో 48.10 రూపాయల వద్ద ముగిసింది.